ప్రజాశక్తి

బుధవారం 21 డిసెంబర్ 2022 అనంతపురం

బహిరంగ సభకు హాజరైన కార్మికులు

పోరాట నినాదం...చైతన్య భరితం...!

- 'అనంత'లో ప్రారంభమైన 'ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు
- నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- రాష్ట్రం నలుమూలల నుంచి తరలొచ్చిన కార్మికులు
- కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టిన నాయకులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఆగ్రహం
- పోరాట స్ఫూర్తిని నింపిన నాయకుల ప్రసంగాలు

కార్మికుల పోరాట నినాదం చైతన్య భరితం అయ్యింది. వేలాది మందితో ఎర్రదండుగా సాగిన ప్రదర్శన అనంతపురాన్ని అరుణారుణం చేసింది. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 14వ రాష్ట్ర మహాసభల సందర్భంగా మంగళవారం నాడు ఎర్రజెండాల ప్రదర్శనతో అనంతపురం నగరం ఎరుపెక్కింది. మహాసభల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలొచ్చిన కార్మికుల మహా ప్రదర్శన ఉత్సాహభరితంగా సాగింది. కార్మికుల కోలాహలం... ఎర్ర జెండా రెపరెపల సోయగం నడుమ మహాప్రదర్శన సాగింది. కార్మికుల హక్కులను కాలరాసే పాలకుల నియంతృత్వ పోకడలు నశించాలంటూ ప్రదర్శనలో నినదించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై బహిరంగ సభలో నాయకులు చేసిన ప్రసంగాలు కార్మికుల్లో పోరాట స్ఫూర్తిని నింపాయి.

సిఐటియు జెండాతో చిన్నారి ప్రదర్శన

మతసామరస్యం చాటే విధంగా ప్రదర్శన

ర్యాలీ ముందు డప్పు వాయిద్యాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 14వ రాష్ట్ర మహాసభ సందర్భంగా అనంతపురం నగరంలో మున్సిపల్ వర్కర్స్ ప్రదర్శన చేపట్టారు. వేలాదిగా తరలివచ్చిన కార్మికులు ఎర్రజెండాలను చేతబట్టి నగర వీధుల్లో కదం తొక్కారు. కృష్ణకళామందిరం నుంచి టవర్‌క్లాక్ సప్తగిరి సర్కిల్ మీదుగా నగర పాలక సంస్థ కార్యాలయం వరకు ఈ ప్రదర్శన సాగింది. డప్పుల మోతలతోపాటు, ప్రదర్శన ముందు భాగంలో మత సామరస్యం చాటే విధంగా మూడు రంగులతో ముగ్గురు వ్యక్తులు ఎరుపు, తెలుపు, పసుపు దస్తులు ధరించారు. వారికి అటూఇటు అల్లూరి సీతరామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి, అంబేద్కర్ వేషధారణలోనున్న ఉన్నవారు నడిచారు. వారి వెనుకభాగంలో సిఐటియు ముఖ్య నేతలంతా ప్రదర్శనగా ముందుకు కదిలారు. ప్రదర్శన మధ్యలో పలు కూడళ్లలో మెడికల్ రెప్స్, ఎపి పంచాయతీ వర్కర్స్ యూనియన్, మధ్యాహ్న భోజన కార్మికులు పుష్పగుచ్ఛాలిచ్చి ర్యాలీకి స్వాగతం పలికారు. ఎర్ర జెండాలు చేతబట్టిన కార్మికులు అనంతపురం నగర పాలక సంస్థ ఎదురుగా ఏర్పాటు చేసిన బహిరంగ సభ వద్దకు చేరుకున్నారు. మూడు రోజులపాటు జరుగనున్న మహాసభలు బహిరంగ సభతో ప్రారంభం అయ్యాయి. కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో పలువురు రాష్ట్ర నాయకులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, సిఐటియు జిల్లా నాయకులు ఆర్‌వి.నాయుడు, గోపాల్, ముర్తుజా, వెంకటనారాయణ, వి.రామిరెడ్డి, మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు వెంకటరెడ్డి, సామ్రాజ్యం, జ్యోతిబసు, నాగేంద్ర, సోమయ్య, సుబ్బలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శకుంతల, రామాదేవి, గ్రామ పంచాయతీ ఉద్యోగులు యూనియన్ జిల్లా కార్యదర్శి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం పట్టని ప్రభుత్వాలు...
సిహెచ్.నర్సింగరావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు.

సమాజానికి సేవ అందిస్తున్న కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించడం దుర్మార్గమని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు తెలిపారు. ఎవరి దయాదాక్షిణ్యాలు కార్మికులకు అవసరం లేదని, హక్కులు అమలు చేస్తే చాలన్నారు. మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోందన్నారు. దీనిని ప్రతఘటించాల్సిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మోదీకి మొకరిల్లడం సిగ్గుచేటన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరించే కుట్రలు చేస్తుంటే కార్మిక వర్గం ఐక్యంగా పోరాడుతూ అడ్డుకుంటోందన్నారు. జనవరి 2,3,4 తేదీల్లో భీమవరంలో సిఐటియు రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని, ఇందులో భవిష్యత్ పోరాట కార్యచరణ రూపొందిస్తామన్నారు. ప్రభుత్వ మెడలు వంచైనా కార్మికుల హక్కులు కాపాడుకుంటామన్నారు.

అంబేద్కర్... అల్లూరి వేషధారణలో..

పాదాలు కడిగి వదిలేశారు..!
సుబ్బారావు, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు.

మనిషి పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు వారికి మున్సిపల్ కార్మికులు సేవలు అందిస్తూనే ఉంటారని అలాంటి కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయనిమున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు తెలిపారు. కార్మికులకు వ్యతిరేకంగా పని చేసిన చంద్రబాబును సాగనంపితే పొడిచేస్తానంటూ నమ్మబలికి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌హన్‌రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. కష్టజీవులకు అండగా సిఐటియు నిరంతరం కొనసాగిస్తున్న పోరాటాలతోనే హక్కులు సాధించుకోగలిగామన్నారు. కరోనా కాలంలో సేవలు అందించిన కార్మికులను మోదీ పాదాలు కడిగి పొగిడి, ఆ తరువాత వదిలేశాడన్నారు. హక్కులు అమలు చేయకుండా వాటిని కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాట తప్పిన జగన్మోహన్‌రెడ్డి...
ఉమా మహేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కార్మికులకు అనేక హామీలిచ్చి అధికారంలోకి రాగానే వాటిని పట్టించుకోకుండా మాట తప్పారనిమున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులరైజేషన్ చేస్తామని ఆప్కాస్ ఇచ్చి ఉద్ధరించారనడం అన్యాయంగా ఉందన్నారు. కార్మికులను ఆప్కాస్‌లో చేర్చడం ద్వారా ప్రభుత్వ సంక్షేమాలు రద్దు చేశారన్నారు. ఉద్యోగులుగా పరగణిస్తున్నారు తప్పా, సౌకర్యాలు అమలు చేయడం లేదన్నారు. కరోనా కాలంలో మున్సిపల్ కార్మికులు మరణిస్తే రూ.50 లక్షలు ఇన్సూరెన్స్ ఇస్తామని హామీ ఇచ్చి ఒక్క రూపాయి కూడా ఇచ్చింది లేదన్నారు. లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికుల హక్కులను హరిస్తున్న మోదీని నిలదీసే దమ్ము జగన్ ఉందా అంటూ ప్రశ్నించారు. కార్మికులు, శ్రామికులు ఏకమై మోదీని గంగలో కలిపే రోజులు దగ్గరపడ్డాయని తెలిపారు.

పెట్టుబడిదారులకే అచ్చేదిన్...
ధనలక్ష్మి, శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్.

అచ్చేదిన్ తెస్తామన్న మోదీ పెట్టుబడీదారులకు మాత్రమే అచ్చేదిన్ తెచ్చారనిశ్రామిక మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ ధనలక్ష్మి పేర్కొన్నారు. మోడీ 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశాడన్నారు. మోదీకి దేశంలో కరోనా వచ్చినప్పుడు, జగన్‌కు రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే కార్మికులు గుర్తుకు వస్తారా.? అంటూ ప్రశ్నించారు. మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజేషన్ చేసేంత వరకు పోరాటం చేస్తామన్నారు.

ఎగవేతదారులకు రాయితీలా..?
జి.ఓబులు, సిఐటియు రాష్ట్ర నాయకులు

మోదీ ప్రభుత్వం రూ.లక్ష కోట్లు బ్యాంకు రుణం ఎగవేత దారులకు రాయితీలు ఇస్తూ కార్మికులకు కనీస వేతనాలు అమలు ఇవ్వకపోవడం ఏమిటని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు ప్రశ్నించారు. కార్మికులు శ్రమిస్తుండటంతోనే ప్రభుత్వాలు, ప్రజలు బాగున్నారని తెలిపారు. దుర్గంధాలను తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోనే ప్రజలందరూ జీవనాన్ని సాగిస్తున్నారని గుర్తు చేశారు. అలాంటి వారి సంక్షేమానికి కృషి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. సిఐటియు నీడలో కార్మికుల హక్కులు రక్షింపబడతాయని అందరూ కలిసికట్టుగా పోరాడి హక్కులు సాధించుకుందామన్నారు.

సుబ్బారావు | సిహెచ్.నర్సింగరావు | ఉమామహేశ్వరావు | ధనలక్ష్మి | జి.ఓబులు

ఆదర్శనీయుడు అంబేద్కర్

- సమసమాజ స్థాపన, దేశాభివృద్ధికి కృషి
- నృత్యరూపకంతో అంబేద్కర్ జీవితావిష్కరణ
- కళ్లకు కట్టినట్లు నాటక ప్రదర్శన
- ఆద్యంతం ఆసక్తిగా తిలకించిన వీక్షకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సమాజహితం కోసం పని చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆదర్శనీయుడని పలువురు వక్తలు కొనియాడారు. ఐద్వా, ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో 'సాంస్కృతిక బహుజన ఉత్సవాలు' అనంతపురం లలిత కళాపరిషత్‌లో జరుగుతున్నాయి. రెండవ రోజు మంగళవారం నాడు 'సంఘం శరణం గచ్ఛామి' పేరుతో అంబేద్కర్ జీవిత చరిత్రను నృత్యరూపక ప్రదర్శన సాగింది. అంబేద్కర్ చిన్న తనంలో విద్యను అభ్యసించే సమయంలో ఏ రకంగా వివక్షకు గురయ్యాడు.. విద్యాభ్యాసం ఏ రకంగా సాగింది... ఉన్నత విద్య కోసం ఏ రకమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారన్న అంశాలను ఈ ప్రదర్శనలో కళ్లకు కట్టినట్టు చూపించారు. మనుధర్మాన్ని అగ్నికి ఆహుతి చేయడం, నాసిక్ కాలారామ్ ఆలయ ప్రవేశానికి జరిగిన ఘటన దృశ్యాలను ఈ ప్రదర్శనలో చూపించారు. కమ్యూనల్ అవార్డుకు వ్యతిరేకంగా గాంధీజీ జైల్లో నిరాహార దీక్ష చేస్తున్న సమయంలో ఆయన ఎదుర్కొన్న మానసిక ఒత్తిడి తదితర అంశాలను నాటక ప్రదర్శనలో చూపించారు. ఈ నాటకం సాగుతున్నంత సేపు విద్యార్థులు ఆసక్తిగా, ఎంతో ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. ఈ నాటక ప్రదర్శన అనంతరం ఈ కార్యక్రమానికి చూడటానికి వచ్చిన వారందరూ ఎంతో బాగుందని, అంబేద్కర్ జీవిత చరిత్రను, ఆయన పోరాటాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారంటూ ప్రశంసలు కురిపించారు.

అంబేద్కర్ జీవితాన్ని అందరూ తెలుసుకోవాలి

అంతకు మునుపు జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ అంబేద్కర్ జీవిత చరిత్రను ప్రతి ఒక్క విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. చిన్న తనం నుంచే ఆయన ఎదుర్కొన వివక్ష, ఆ తరువాత మహోన్నతమైన వ్యక్తిగా ఏది దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన వ్యక్తి అని కొనియాడారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలు పెరిగిన ఈ సమయంలోనున్న విద్యార్థులకు ఆనాటి పరిస్థితులు ఏ విధంగా ఉండేవన్నది తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. ఆనాడున్న అనేక రుగ్మతలపై పోరాటం సాగించి ఎదగడమే కాకుండా దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహోన్నతమైన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. ఈ విషయాలు నేటి తరానికి అందించేందుకు ఇటువంటి ప్రదర్శనలు మరిన్ని అవసరమన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ హనుమంతప్ప, డీఎస్పీ ఎ.శ్రీనివాసులు, బ్యాంకు ఉద్యోగ సంఘం నాయకులు కృష్ణమూర్తి, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, ఐద్వా రాష్ట్ర నాయకులు సావిత్రి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్, ప్రజాసంఘాల నాయకులు

'సంఘం శరణం గచ్ఛామి' అంతంలో భాగంగా అంబేద్కర్ జీవిత చరిత్ర నృత్యరూపక ప్రదర్శనలోని దృశ్యాలు..

సోలార్ పార్క్ ఏర్పాటుతో ప్రయోజనం

ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

రైతులతో మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం రూరల్ : సోలాపూర్ పార్క్ ఏర్పాటు చేసినందుకు భూములు ఇచ్చే రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. మంగళవారం డి.హీరేహాల్ మండలంలోని ఎం.హనుమాపురం, దొడగట్ట, కాదలూరు తదితర గ్రామాల్లో సోలార్ పార్కు ఏర్పాటుపై రైతులతో చర్చించారు. సోలార్ పార్కు ఏర్పాటుకు భూములిస్తున్న రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతుల సందేహాలు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో శివరామిరెడ్డి, ఆంజనేయులు, హనుమంతురెడ్డి, నెడ్‌క్యాప్ జిల్లా అధికారులు వరప్రసాద్, నాయకులు రాజేంద్రరెడ్డి, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే...

మృత్యుపాశాలుగా హెచ్చెల్సీ బ్రిడ్జిలు

ప్రజాశక్తి-పుట్లూరు

దారిలో వెళ్లేటప్పుడు ఆదమరిచారా.. అంతే సంగతి.. కాలువలో పడిపోక తప్పదు.. మండల కేంద్రంలోని హెచ్ఎల్‌సి కాలువపై ఏర్పాటు చేసిన బిడ్జిలకు ఇరువైపులా ఉన్న సైడ్‌వాల్స్ కూలిపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనచోదకులు బెంబేలెత్తుతున్నారు. గతంలో బ్రిడ్జిపై వెళ్తూ ఓ వ్యక్తి కాలువలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. మరీ ముఖ్యంగా కస్తూరిబా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలకు వెళ్లే విద్యార్థినీ, విద్యార్థులు ఈ బ్రిడ్జిపైనే వెళ్లాలి. ఈనేపథ్యంలో హెచ్ఎల్‌సికి నీరు విడుదల చేయడంతో విద్యార్థులతోపాటు తల్లిదండులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువపై ఏర్పాటు చేసిన బ్రిడ్జికి ఇరువైపులా సైడ్ వాల్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

సైడ్‌వాల్ కూలిన బ్రిడ్జి వద్ద నడుచుకుంటూ వెళ్తున విద్యార్థినులు

ప్రజాశక్తి
www.prajasakti.com

ముగ్గుల పోటీలు

నార్పల : సిఎం జగన్ జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఐకెపి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ ఛైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, ఎంపిడిఒ దివాకర్, సర్పంచ్ మనీలా సుప్రియ, పంచాయతీ సెక్రటరీ అశ్వర్థమనాయుడు, ఉప సర్పంచి గవ్వల శ్రీరాములు, ఎపిఎం తిప్పమ్మ, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, ఐకెపి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : సిఎం జగన్ జన్మదిన వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన అనిత, రాజేశ్వరి, చరితకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి, తహశీల్దార్ సుమతి, వైద్యాధికారిణి శ్రీవాణి, వివిధ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌ల చోరీపై విచారణ

నార్పల : మండలంలోని బి.పప్పూరు బాల యోగి గురుకుల పాఠశాలలో ల్యాప్‌ట్యాప్ చోరీ ఘటనపై ఎస్ఐ వెంకటప్రసాద్ మంగళవారం విచారణ చేపట్టారు. పాఠశాలలో 16 ల్యాప్‌టాప్‌లు చోరీకి గురైన విషయం తెలిసిందే. దీంతో ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ పాఠశాలకు చేరుకుని ల్యాప్‌టాప్‌లు భద్రపరిచిన గదులను పరిశీలించారు.

11న వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ

గుత్తి : గుత్తిలో ఏర్పాటు చేసిన రేనాటి వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహాన్ని వచ్చేనెల 11న ఆవిష్కరించనున్నట్లు ఒసిసిఐ జాతీయ శాశ్వత సభ్యులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి.లక్ష్మిదేవమ్మ తెలిపారు. ఈమేరకు మంగళవారం స్థానిక పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 11న గుత్తిలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, ఒసిసిఐ జాతీయ అధ్యక్షులు శంకర్‌లాల్ ఓడి, రాష్ట్ర నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒసిసిఐ జాతీయ సంయుక్త కార్యదర్శి వి.బాలనరసింహుడు, నాయకులు వి.వరదరాజులు, మనోజ్, ఆర్కే రవి, నల్లప్ప, పోతులూరి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONOURABLE DISTRICT JUDGE, ANANTAPURAMU.
G.W.O.P. 67/2022
(In the matter Sale of property of minor's K,Bhavisya, K.Hamsavarshin Reddy)
Between:
Korrapati Nagalakshmi ...**petitioner**
V/s
Nil ...**Respondent**

నోటీసు
ఇందుమూలముగా తెలియజేయడమేమనగా వాది కొర్రపాటి నాగలక్ష్మి తన భర్త పూర్వపు ఆస్తిని, వారసత్వంగా పొందిన మైనరు కుమార్తెలు కె.భవిష్య, కె.హంసవర్షిని రెడ్డి, యొక్క 1/5 వ భాగము కోర్టు ద్వారా అనుమతితో హక్కుపై ఇతరులకు అమ్ముటకు కోర్టు అనుమతికై దావా వేసినారు. పై కేసు తేది 4-1-2023 న వాయిదా ఉన్నది. కావున ఎవరికైన ఆక్షేపణలు లేదా అభ్యంతరములు వున్న యెడల పై తేది ఉదయం 10:30 గంటలకు రాజశ్రీ కోర్టు నందు స్వతహాగా లేక వకీలు ద్వారా ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేని యెడల కోర్టు వారు వాది పరమున తీర్మానించెదరు.

SCHEDULE
Item No.1
Land situated within the RD of Anantpuran-iu and SRDof Tdipatri of Chinthakayamandi village of Yellanuru Mandal with the following particulars,
Babu **Survey No.** **Extent.**
Govt-Wet 449-D Ac.2.25 cents
With the following boundaries:
East: RAstha West: land of Akula Bypi Reddy North: Land in the same S.No. South: Land of Sameswara Reddy and others.
Item No.2
House bearing D.No. 5-7B constructed in 387.2 Sq Yrads with the RD of Anantapuramu and SRD of TAdipatri within the Thimmmarnpalli Villag of Chintakaya Manda Panchayat with the following:
Boundaries:
East: House of Araveti Sivudu
West:Rastha
North:Rasrth: RAstha
South:house of Araveti Gangappa.
Measures:
East to west: 15 feet of 4,57 mts. North to south: 30 feet or 9.15 Mts.,
(By court order)
Sigicherla K.Chandra Sekar,

IN THE COURT OF THE II ADDITIONAL SENIOR CIVIL JUDGE CUM MACT-XI AT BALLARI.
M.V.C. No.391 of 2022
Between:
Kum.Y.Kokila(MVC No.391/2022)
Kum.Y.Haritha (MVC No.392/2022)
... **Petitioners**
And
Prathap Reddy.P. and others
Resdondent No.2
To
Syed Jeelani S/o Syed Nade Ali Aged about 49 years Owner of the Bus bearing Reg No.AP-39/TU-0786 R/o 1-2-233-1 Kumbrigunda street Rayadurga, Anantapura district-515865
NOTICE
As, the above named petitioner has filed the above claim petition against you and other respondents under section 166 of Motor Vehicle Act for seeking compensation for the sustained grevious nature of fractures and injuries by the petitoner in the motor vehicle accident, which taken place on 21-03-2022 at about 11-20.a.m. bypass road, near Balu petti bunk, Golla Village, Kalyanadurga mandal. You are hereby directed to appear before this Honourable court in person or by a pleader duly instructed on 10-01-2023 at about 11 00 a.m., in the fore-noon before this Honourable Court to show cause against you, failing which the petition will be heard and determined as ex-parte.
Given under my hand and seal of the court on this 5th day of Dec 2022.
(By Order of th ourt)
B.JAGANNATHA
ADVOCATE FOR THE PETITIONERS

ప్రయివేటు ఆసుపత్రుల్లో దోపిడీని అరికట్టాలి

చర్చావేదికలో పలువురు వక్తలు

ప్రజాశక్తి-గుంతకల్లు

వైద్యం ముసుగులో ప్రయివేటు ఆసుపత్రుల్లోని కొందరు డాక్టర్లు ప్రజలను దోచుకుంటున్నారని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మంగళవారం స్థానిక సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో పట్టణ పేదల సంఘం ఆధ్వర్యంలో 'ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం.. విద్యార్థిని ముబీనా బేగం మృతి.. ప్రయివేట్ నర్సింగ్ హోంలలో వైద్యం ముసుగులో దోపిడీ' అనే అంశాలపై చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, పౌర ప్రగతిశీల సంఘం కార్యదర్శి తారకేష్, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్, ఒపిడిఆర్ జిల్లా ఉపాధ్యక్షులు, న్యాయవాది నాగరాజు మాట్లాడుతూ విద్యార్థిని ముబినా బేగం మరణం వైద్యుడు రామాంజనేయులు చేసిన హత్యగానే భావిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులు ప్రజలకు వైద్యం అందించడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్లు కొందరు క్లినిక్‌లు, నర్సింగ్ హోంలు పెట్టుకుని ప్రభుత్వ వైద్యం అందించకుండా బయట వైద్యం చేస్తూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నారని

చర్చావేదికలో మాట్లాడుతున్న వక్తలు

ఆరోపించారు. ప్రభుత్వాసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నా ఏ ఒక్కటీ వినియోగించుకోకుండా నిర్లక్ష్యం చేస్తూ ప్రయివేట్ నర్సింగ్ హోములతో కుమ్మక్కై ఆపరేషన్లు బయట జరిగే విధంగా ప్రోత్సహిస్తున్నారన్నారు. వారి ఆగడాలను ఎవరైనా ప్రశ్నిస్తే మాఫియా పద్ధతిలో హెచ్చరికలు, బెదిరింపులు చేసే స్థాయికి ప్రయివేటు డాక్టర్లు దిగజారారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య భయాలను డబ్బు రూపంలోకి మార్చుకునేందుకు అవసరం లేకున్నా రకరకాల టెస్టులు, అధిక మందులను కొనుగోలు చేయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అనంతరం భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించారు. విద్యార్థిని షేక్ ముబీనా బేగం మృతి చెందిన ఘటనపై నిజ నిర్ధారణ కమిటీ ఏర్పడి వాస్తవ విషయాలను సేకరించి కుటుంబానికి న్యాయం చేయాలని తీర్మానించారు. ఈ చర్చా వేదికలో ఐఎఫ్‌టియు గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి చిన్నా, పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఆదినారాయణ, పట్టణ పేదల సంఘం కార్యదర్శి జిలాన్, సంచార జాతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఎఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్, అడ్వకేట్ సురేష్, ముస్లిం హక్కుల సంఘం కార్యదర్శి ఆరీఫ్, ప్రగతిశీల మహిళా సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఆశాబీ, ఐఎఫ్‌టియు నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీరాములు, పిడిఎస్‌యు కార్యదర్శి రంగస్వామి, ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి వెంకట్‌నాయక్, ఐఎఫ్‌టియు కమిటీ నాయకులు రామంజి, బాషా, షేక్షావలి, గోపీ, పిడిఎస్‌యు నాయకులు పవన్, పిఒడబ్ల్యు కమిటీ నాయకురాళ్లు సువర్ణ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ

'ఓ చెల్లీ..జాగ్రత్త'

ప్రజాశక్తి-గుత్తి

విద్యార్థినులు సురక్షిత మార్గంలో నడవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని నిజామీ షాదీఖానాలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక ఆధ్వరంలో 'ఓ చెల్లి జాగ్రత్త' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, ఎంపిపి జి.విశాలాక్షి మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. బాలికలు అభివృద్ధి చెందాలంటే విద్య ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. చదువు ఎల్లప్పుడు తోడ్పాటును అందిస్తుందన్నారు. సెల్‌ఫోన్లను విద్యార్థినులు మంచికి వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ వికె.శ్రీవాణి, ప్రయివేటు పాఠశాలల కరస్పాండెంట్లు నిర్మలస్వామి, మున్నాజ్‌బేగం, శశికళ, రఫీ, నాగలక్ష్మి, ఐద్వా మండల అధ్యక్షురాలు కవిత, ఎస్ఎఫ్ఐ నాయకులు గౌతం నాయక్, కృష్ణ, శివనాయక్, పవన్ గౌడ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలకు శాశ్వత కోడ్ రూపొందించాలి

ఐక్యవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ప్రభుత్వం శాశ్వత కోడ్‌ను రూపొందించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బదిలీలు క్రమం తప్పకుండా జరిగేలా నిర్దిష్ట షెడ్యూల్‌ను రూపొందించి ఉపాధ్యాయులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ బదిలీల షెడ్యూలులో మార్పులు చేస్తూ ఉపాధ్యాయులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. బదిలీలు చేయడానికే ముందే ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎమ్మెల్సీలతో చర్చించి నిబంధనలు, పాయింట్ల కేటాయింపు మంచి అంశాల గురించి చర్చించిన తర్వాత షెడ్యూల్‌ను విడుదల చేయాల్సిందన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన బదిలీల జీవోలో పలు లోపాలు ఉన్నాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి లోపాలను సరిచేసి బదిలీలను చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఎన్నో ప్రాథమిక పాఠశాలల్లో కేవలం ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉండడం వల్ల తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం న్యాయస్థానాలకు వెళ్లే హక్కు ఉపాధ్యాయులకు ఉందన్నారు. తొలుత తమకు సమాచారం ఇవ్వకుండా కోర్టులకు వెళ్లారన్న కారణంతో పలువురు విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులకు నోటీసులు ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను అధికారులే పరిష్కరిస్తే వారు న్యాయస్థానాలకు వెళ్లాల్సిన అవసరమే ఉండదు కదా అన్నారు.

సీనియర్లు, జూనియర్లు స్నేహపూర్వకంగా మెలగాలి

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజ

ప్రజాశక్తి-అనంతపురం

వైద్య విద్యనభ్యసిస్తున్న జూనియర్లు, సీనియర్లు స్నేహ పూర్వకంగా మెలగాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజ కోరారు. ఈమేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల, బాలికలు, బాలుర వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య కళాశాలలో ర్యాగింగ్‌కి చోటు లేదన్నారు. ఎందుకంటే ర్యాగింగ్ నియంత్రణ కమిటీ, ర్యాగింగ్ జరగకుండా పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను సభ్యులుగా నియమించామన్నారు. వారు రోజూ మూడు పూటలా వసతి గృహాలను సందర్శించి నివేదికలు అందిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ విద్యార్థులు కూడా ఎంతో క్రమశిక్షణతో మెలుగుతున్నారని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు డాక్టర్ శారద, డాక్టర్ వేముల సరోజ, డాక్టర్ అబ్దుల్ మజీద్, డాక్టర్ శ్రీనివాసరావు, హాస్టల్ ఇన్‌ఛార్జిలు లక్ష్మీనారాయణ, సుజాత, వాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీరజ

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం శక్తివంచన లేకుండా పనిచేస్తోందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విడపనకల్లు మండలం కొత్తకోట గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహిళలతో కలిసి సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం మూడేళ్లుగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. అనంతరం సమస్యలు ఏమైనా ఉన్నాయా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు చెప్పిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి, జెడ్పిటిసి హనుమంతు, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ భీమ్‌రెడ్డి, వైసిపి నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించకపోతే చర్యలు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని రహదారుల్లో ఉన్న ఆక్రమణలను తొలగించకపోతే చర్యలు తీసుకుంటామని పట్టణ ప్రణాళిక అధికారి అబ్దుల్‌సత్తార్ హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎస్‌లో ఉన్న అంబేద్కర్ కాలనీలో అంతర్గత రహదారులను మున్సిపాలిటీ అధికారులు రీసర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణ ప్రణాళిక విభాగ అధికారి సిబ్బందితో చేరుకుని మంగళవారం రహదారులకు కొలతలు వేశారు. ఈ సందర్భంగా రికార్డుల ఆధారంగా కొలతలు వేసి ఎంతమేర ఆక్రమించారో మార్క్ వేశారు. 28 అడుగులు ఉండాల్సిన రోడ్డు అక్రమ కట్టడాలతో 12 అడుగులకు కుదించుకుపోయిందని టిపిఒ తెలిపారు. అక్రమ నిర్మాణాలను ఎవరికి వారే స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు. లేకుంటే తామే తొలగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిపిబిఒ తమీం, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు మేలు చేసేలా పనులు చేయాలి

రాయదుర్గం రూరల్ : వ్యవసాయ అనుబంధంగా ఉన్న మార్కెట్ యార్డు శాఖకు ద్వారా రైతులకు మేలు చేసే పనులు చేయాలని విప్ కాపు రామచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయంలో తొలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల విక్రయాలకు సంబంధించి బహిరంగ మార్కెట్ కంటే ప్రభుత్వ పరంగా లాభసాటి ధరలు, తూకల్లో మోసాలు లేకుండా రైతులకు మేలు చేసేలా నూతన కమిటీ పని చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నేపథ్యం ఉన్న వారు కమిటీలో ఉన్నందున రైతుల సమస్యలను కమిటీ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. రైతుల శ్రేయస్సుతోపాటు, మార్కెట్ కమిటీ లక్ష్యాలను సాధించేలా నూతన పాలకవర్గం సమన్వయంతో పని చేస్తుందని మార్కెట్ యార్డు ఛైర్మన్ భోజరాజునాయక్, వైస్‌ఛైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాళుశిల్ప, కార్యదర్శి సునీత, హార్టికల్చర్ ఆఫీసర్ దస్తగిరి, మార్కెట్ కమిటీ సభ్యులు రత్నమ్మ, నగేష్, ప్రహ్లాద, తదితరులు పాల్గొన్నారు.

రబీలో ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోండి

బుక్కరాయసముద్రం : రైతులు రబీలో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్యాంసుందరరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని దయ్యాలకుంటపల్లిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ పంట కాలంలో బోరుబావులు, కెనాల్ కింద సాగు చేసిన పంటలను రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో ఈక్రాప్ చేయించుకోవాలన్నారు. ఈక్రాప్ చేయించుకుంటే పంటలను మద్దతు ధరకు అమ్ముకోవడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు నష్టపరిహారం పొందడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఈక్రాప్ చేయించుకోకపోతే ప్రభుత్వ పరిహారం అందదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ మద్దిలేటి, రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్, సర్పంచి సద్దా రమేష్, రైతు నాగమునిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలని వినతి

బొమ్మనహాల్ : విధి నిర్వహణలో పనిభారం తగ్గించాలని పలువురు మండల విఆర్ఒల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వీఆర్వోల మండల సంఘం అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ విఆర్ఒలకు పని ఒత్తిడి ఎక్కువైందన్నారు.ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకే తమ బాధ్యతలు ఉంటాయన్నారు. ముఖ్యంగా సచివాలయంలో బయోమెట్రిక్ వేయడం, రెవెన్యూ కార్యాలయం రావడం, సర్వే బాధ్యతలు తమపై వేయడం వల్ల ఒత్తిడికి గురవుతున్నామన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి విఆర్ఒలకు పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒలు గోపాల్, బండూరు నరసింహమూర్తి, యుగంధర్, పర్వీన్, కుళ్లాయిస్వామి, బాలాజీనాయక్, ఎలెంజ్ రవి, కురవల్లి వన్నూరప్ప, వినయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలను మోసం చేసిన సిఎం జగన్

గుంతకల్లు : ప్రతిపక్ష హోదాలో జగన్ చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు హంద్రీనీవా కాలువ ద్వారా సాగుభూములకు నీరివ్వడంతో పూర్తిగా విఫలమయ్యారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేవరగుడి జగదీష్ విమర్శించారు. మంగళవారం స్థానిక బిటి.పక్కీరప్ప భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం సిఎం జగన్ ప్రతిపక్ష హోదాలో జిల్లాలో ప్రజా సంకల్ప యాత్ర చేసినప్పుడు రాప్తాడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హంద్రీనీవా కాలువ ద్వారా జిల్లాలో 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాక మాట తప్పి.. మడమ తిప్పాడని ఎద్దేవా చేశారు. అదేవిధంగా హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి మల్లియాల నుంచి జీడిపల్లి వరకు పదివేల క్యూసెక్కుల సామర్థ్యం పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. అలాగే తుంగభద్ర హెచ్ఎల్‌సి కాలువ ఆధునీకరణ ఏడాదిలో పూర్తి చేస్తామని నమ్మబలికి ముడున్నరేళ్ల గడుస్తున్నా జిల్లా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయక మాట తప్పాడని విమర్శించారు. జగన్ మాట తప్పినందుకు నిరసనగా ఈనెల 21న నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ నియోజవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, మండల కార్యదర్శి రామురాయల్, సహాయ కార్యదర్శి రామాంజనేయులు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి పిసి కుల్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

సిబిసి కెనాల్‌కు సాగునీరు విడుదల

ఉరవకొండ : మండల పరిధిలోని నింబగల్లు వద్ద జిబిసి కెనాల్ జీరో బై జీరో దగ్గర విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, జడ్పిటిసి హనుమంతు మంగళవారం తాగు, సాగునీరు విడుదల చేశారు. మండల పరిధిలోని కరకముక్కల గ్రామ సమీపంలో 20 రోజుల్లోపు రెండుసార్లు గండి పడటంతో సాగు నీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు సమస్యను మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన జిబిసి అధికారులతో మాట్లాడి వేగవంతంగా మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈనేపథ్యంలో ఎట్టకేలకూ మరమతులు చేపట్టి పూర్తి చేసి సాగునీరు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు కరణం భీమిరెడ్డి, భరత్‌రెడ్డి, మండల కన్వీనర్ బసన్న, మాజీ జెడ్పిటిసి తిప్పయ్య, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు సుంకన్న, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నింబగల్లు వద్ద జిబిసి కెనాల్ జీరో బై జీరో దగ్గర నీరు విడుదల చేస్తున్న నాయకులు

నేరాలు ఘోరాలు

భర్త కనిపించలేదని భార్య ఫిర్యాదు

పుట్లూరు : భర్త కనిపించలేదని భార్య ఫిర్యాదు చేసిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది .పోలీసుల వివరాల మేరకు పుట్లూరుకు చెందిన మడుగు పల్లి సూర్యనారాయణ , 36 సం., తాడపత్రిలో బండల ఫ్యాక్టరీ నందు పనిచేస్తూ ఉన్నాడు. ఇతను వారం రోజుల క్రితం ఇంటి నుండి కూలీ పనికి వెళు న్నాను అని చెప్పి ఇంతవరకు తిరిగి రాలేదని తప్పిపోయిన వ్యక్తి భార్య రామలక్ష్మి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గురు ప్రసాద్ రెడ్డి తెలిపారు.

తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యం

తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

ఆత్మకూరు : 2018 సంవత్సరంలో తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ ఆత్మకూరు పోలీసులు కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని డికె.తండాకు చెందిన శంకర్‌నాయక్ మతిస్థిమితం లేక 2018లో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో అప్పట్లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈనేపథ్యంలో ఆత్మకూరు ఎస్ఐ శ్రీనివాసులు ప్రత్యేక టీం ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టగా పూణేలోని మెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకున్నాడు. దీంతో బాధితుడి తల్లిదండ్రులను అక్కడికి తీసుకెళ్లి చూపడంతో తమ కొడుకే అని గుర్తించారు. ఈనేపథ్యంలో మంగళవారం బాధితుడిని తీసుకొచ్చి డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్ ఎదుట తల్లిదండ్రులకు అప్పజెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ దస్తగిరి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించండి : ఎస్ఐ

ఆత్మకూరు : ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్ఐ శ్రీనివాసులు కోరారు. ఈమేరకు రోడ్డు సేఫ్టీలో భాగంగా మంగళవారం మండలంలోని వై.కొత్తపల్లి సమీపంలో అనంతపురం-కళ్యాణదుర్గం హైవేపై బ్లాక్ స్పాట్‌ను పరిశీలించారు. ఇందులో భాగంగా వేగ నియంత్రణకు డ్రమ్ములు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు రహదారి భద్రతా నియమాలను పాటించాలన్నారు. ముఖ్యంగా వాహనాలకు సంబంధించిన పత్రాలు, లైసెన్స్, ఇతర పత్రాలను వాహనంలో ఉంచుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ దేవానంద్, తదితరులు పాల్గొన్నారు.

26న జెఎన్‌టియులో స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల, ఒపిటిఆర్ఐ కళాశాల, మేనేజ్‌మెంట్ కళాశాలల్లో మిగిలిన కన్వీనర్ కోటా సీట్లకు ఈనెల 26న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ అడ్మిషన్ బి.ఈశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు ఎపి పిజి సెట్ 2022, ఎపిఐసెట్-2022లో అర్హత సాధించడంతోపాటు డిగ్రీ ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒరిజినల్ సరిఫికెట్లుతోపాటు జిరాక్స్ కాపీలను తీసుకుని జెఎన్‌టియులోని పరిపాలనా భవనంలో నిర్వహించనున్న అడ్మిషన్లకు హాజరుకావాలని కోరారు.

పివికెకెలో ముగిసిన వర్క్‌షాప్

అనంతపురం : స్థానిక రుద్రంపేటలోని పివికెకె ఇంజనీరింగ్ కళాశాలలో 'పైథాన్‌తో మెషిన్ లెర్నింగ్' అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా పైథాన్ నిష్ణాతులు డా.లావణ్య కంప్యూటర్ సైన్స్ రెండవ, మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. యావత్ ప్రపంచం అధునాతన సాంకేతికత వైపు పరుగెడుతున్న తరుణంలో విద్యార్థులకు అపారమైన ఉద్యోగావకాశాలతో పాటు అత్యధిక వేతనాలు అందిస్తున్న సాంకేతికత పైథాన్ అన్నారు. పైథాన్ ద్వారా మెషిన్ లెర్నింగ్‌పై ఎవరైతే మంచి నైపుణ్యం సాధించగలుగుతారో వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి భార్గవి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారంలో ఉన్నా..లేకున్నా ప్రజాసేవ ఆగదు..

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టిసి.వరుణ్

అనంతపురం : తాము అధికారంలో ఉన్నా.. లేకున్నా ప్రజాసేవ ఆగదని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ అన్నారు. 6వ రోజు మంగళవారం రుద్రంపేట వద్ద రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో సిమెంట్ పొడి మిశ్రమాన్ని చల్లి గుంతలు పూడ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రహదారులకు ఏర్పడిన గుంతలు పూడ్చలేని దుస్థితిలో ఉందన్నారు. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాగా ఒక్క ఫోన్‌కాల్ చేయగానే జనసేన నాయకులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయడం పట్ల స్థానికులు జనసేన పార్టీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు కుమ్మర నాగేంద్ర, నగర ఉపాధ్యక్షులు జక్కిరెడ్డి ఆదినారాయణ, జిల్లా కమిటీ సభ్యులు అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, దరాజ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని నిరసన

కణేకల్లు : మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి శాంతరాజు మాట్లాడుతూ మండలంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థి నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కళాశాల ఏర్పాటు చేయాలని ఆందోళన చేస్తుంటే పోలీసులు అరెస్టు చేయడం బాధాకరమన్నారు. అలాగే సకాలంలో బస్సులు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌస్‌పీర్, శర్మాస్‌వలి, శశికుమార్, కిషోర్, మహేష్, సంతోష్, యోగేంద్ర, మధుసూదన్, మంజు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

రైతు దినోత్సవానికి ఆహ్వానం

ఉరవకొండ : జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించనున్న రైతు దినోత్సవానికి హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిని జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబులేసు ఆహ్వానించారు. ఈమేరకు మంగళవారం ఉరవకొండలోని పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన విశ్వేశ్వరరెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఇందుకు సంబంధించిన పోస్టర్లను విశ్వేశ్వరరెడ్డితో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జైకిసాన్ ఫౌండేషన్ సభ్యులు షేక్షావలి, వీరాంజినేయులు, సురేంద్ర, రమేష్, దాదావలి, కోమలి, లక్ష్మీ, వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్పోర్ట్స్ డే వేడుకలు

అనంతపురం : నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీచైతన్య బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం స్పోర్ట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ జ్ఞానాన్ని పుస్తకానికి పరిమితం చేయకుండా ఆటపాటలకు కూడా కేటాయించాలన్నారు. మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ జి.సావిత్రి మాట్లాడుతూ ఆటల పోటీల్లో పాల్గొనడం ద్వారా దఢమైన శరీరం లభ్యమవుతుందన్నారు. తద్వారా చదువుల్లో మంచి ప్రతిభ కనబరుస్తారన్నారు. ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ మెదడుకు వ్యాయామం చదువు అయితే.. శరీరానికి వ్యాయామం ఆటలు అన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే ఆత్మవిశ్వాసంతో ఏ రంగంలోనైనా రాణిస్తారన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 1 టౌన్ ఎస్ఐ తిప్పయ్యనాయక్, ప్రిన్సిపాల్ సమీనాఖాన్, అక్కడమిక్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ షమీనా, డీన్ సత్యనారాయణ, కోడీన్ చంద్రమోహన్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బందం తదితర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

27న డైరీ ఆవిష్కరణ

అనంతపురం : స్థానిక కెటిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 27న రాష్ట్రస్థాయి ఒసి వెల్ఫేర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరించనున్నట్లు సంఘం అధ్యక్షులు కళ్యాణ చక్రవర్తి, కార్యదర్శి జితేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ శాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. దాదాపుగా వెయ్యి మంది విద్యుత్ ఉద్యోగులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒసి ఉద్యోగుల సంఘం ట్రెజరర్ శ్రీనివాసమూర్తి, సభ్యులు లక్ష్మీపతిరెడ్డి, భూపతి, లలిత్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు అమర్నాథ్, బాబా ఫక్రుద్దీన్, ప్రదీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.